సరైన సమయానికి సిరిమాను తిప్పాలి..

● పైడితల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు



పైడితల్లిని దర్శించుకుంటున్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు

విజయనగరం టౌన్: సరైన సమయానికి సిరిమాను తిప్పగలిగితే భక్తులు సంతోషిస్తారని పైడితల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. తొలేళ్ల పర్వదినం సందర్భంగా పైడితల్లి అమ్మవారికి కోట నుంచి సంప్రదాయ పద్ధతిలో పల్లకీలో పట్టు వస్త్రాలను తీసుకువచ్చి చదురుగుడిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 250 ఏళ్లుగా అమ్మవారి పండగ జరుగుతోందన్నారు. గతేడాది అనేక అపశృతులు జరిగాయని, ఈ ఏడాది అలా జరగదని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరోగ్యానికి రక్షణగా.. జగనన్న ఆరోగ్య సురక్ష

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మందుల కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. శిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, సర్పంచ్ బంగారమ్మ, నాయకులు ఆల్తి ఆదినారాయణ, జమ్ము అప్పలనాయుడు, వైద్యులు సాయినందిని, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం..

మండలంలోని అలుగోలులో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ప్రజలకు ఉన్న ఊరిలోనే మెరుగైన సేవలు అందాలనే లక్ష్యంతో గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

● నేటి మధ్యాహ్నం 3.15 గంటలకు సిరిమాను తిరువీధి ఆరంభం
● హుకుంపేట నుంచి 12 గంటలకే తరలింపు
● ఉత్సవానికి 50 అడుగుల సిరిమాను సిద్ధం
● సిరిమానును ఏడోసారి అధిరోహించనున్న పూజారి వెంకటరావు

విజయనగరం టౌన్: భక్త కోటికి ముక్తిదాయకం సిరిమాను వీక్షణం. ఆ చల్లని తల్లి కరుణా కటాక్షాల కోసం లక్షలాది మంది భక్తులు సిరిమానును దర్శించుకునేందుకు తరలివస్తారు. సిరిమానుపై పూజారి రూపంలో వచ్చిన పైడితల్లిని కనులారా వీక్షించాలని పరితపిస్తారు. ఈ బృహత్తర ఘట్టం మరికొద్ది గంటల్లో ప్రారంభంకానుంది. ఆ సిరి సంబరాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తజనం ఇప్పటికే విజయనగరం చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభమయ్యే సిరిమానోత్సవంలో ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు ఈ ఏడాది ఏడోసారి సిరిమానును అధిరోహించనున్నారు. సుమారు నాలుగున్నర లక్షలమంది భక్తులు తరలివస్తారని అంచనా. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారయంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది.

అన్నీ రసవత్తర ఘట్టాలే..

భక్తులను విశేషంగా ఆకట్టుకునే సిరిమానోత్సవంలో అన్నీ రసవత్తర ఘట్టాలే. 50 అడుగుల పొడవున్న సిరిమాను ఉపరితలంలో బిగించే ఇరుసుపై ఏర్పాటుచేసిన పీటపై ప్రధాన పూజారి విసనకర్ర చేతపట్టి ఆసీనులవుతారు. రెండో చివరన రథంపై అమర్చిన ఇరుసును మానుకు అమరుస్తారు. దాని ఆధారంగానే మాను పైకిలేస్తుంది. గజపతిరాజ వంశీయుల్లో ఒకరు తాడు లాగడంతో సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్దన ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి మొదలై రాజా బజారు మీదుగా కోట వరకూ మూడుసార్లు తిరుగుతుంది. ఊరేగింపు ఆద్యంతం విసన్నకర్ర విసురుతూ కనిపించే సిరిమాను పూజారిని భక్తులు అరటిపండ్లతో కొలుస్తారు.



పైడితల్లి అమ్మవారు

కోటవరకూ మూడుసార్లు

అత్యంత నియమనిష్టలతో ఉపవాసం ఉండే సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు హుకుంపేటలో మధ్యాహ్నం 12 గంటలకు కాలినడకన వీధుల్లోంచి బయలుదేరి వేలాది మంది భక్తుల సందడితో ఊరేగింపుగా వస్తారు. దారిపొడవునా ప్రజలు పూజారి పాదాలపై పసుపునీటిని పోసి దీవెనలు అందుకుంటారు. అనంతరం నిర్ణయించిన ముహూర్తానికి సిరిమానును అధిరోహిస్తారు.

సిరిమానుతో సంబరం ప్రారంభానికి ముందు పాలధార, ఆలయానికి రావడం ఆనాదిగా వస్తున్న ఆచారం. జాలరివలను వెన్నంటే ఈటెలు చేతపట్టి వచ్చే జనం మహాశక్తి స్వరూపాలుగా భావిస్తారు. పాలధారగా పిలిచే జనధార అమ్మవారి సైనిక శక్తికి వారసులంటారు. తొలుత కొందరు ఈటెలను ధరించి అమ్మవారి ఆలయానికి వస్తారు. అక్కడ పైడిమాంబను దర్శించుకున్న అనంతరం డప్పు, వాయిద్యాలతో కోట వద్దకు చేరుకుంటారు. ఇక్కడ పూజలు చేసిన అనంతరం కోటకు పశ్చిమ భాగంవైపు వెళ్లి, కోటశక్తికి నమస్కరిస్తారు. సైనికులుగా పనిచేసే వీరంతా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న భావంతో గ్రామ కట్టడి చేస్తారు. ఈ ఘట్టంలో సాకేటివీధికి చెందిన వారు పాల్గొంటారు. ఇక జాలరివలతో యాతవీధికి చెందిన జాలర్లు పాల్గొంటారు. ఇక జాతరలో సిరిమానుకు అంజలి ఘటిస్తూ ముందుకు సాగే అంజలి రథం ఉంటుంది. అంజలి రథంపై నడిచేన, కోరాడ కుటుంబాల వారు ముందుకు సాగుతారు. నాటుబండిపై డోలును బిగించి, దానికి అటు, ఇటు రాటలను కడతారు. దానిపై ఐదుగురు పురుషులు మహిళల వేషధారణలో కూర్చొంటారు. వీరంతా ఆరుమూరల నార చీరను చేతికి వెండి సందెలను ధరిస్తారు. వీరంతా అమ్మవారి పరిచారకులుగా వ్యవహరిస్తారు. చివరిగా సంబరంలో తెల్ల ఏనుగుకు విశిష్ట స్థానం ఉంది. పూసపాటి గజపతులు ముస్తాబు చేసిన అంబారీ ఏనుగుపై కూర్చొని సంబరంలో పాల్గొనేవారు. సిరిమానుకు ముందు పట్టపుటేనుగు నడిచేది. దానికి ప్రతిరూపమే ఈ వాహనం. ఈ ఏనుగుపై ఒక పురుషుడు, స్త్రీ వేషంలో ఉండే మరో ఏడుగురు పురుషులు కూర్చొంటారు. వీరంతా పైడితల్లమ్మకు అక్కాచెలెళ్లు అయిన గ్రామదేవతలుగా, మగవేషంలో ఉన్న వ్యక్తి అమ్మవారి సోదరుడు పోతురాజుగా భావిస్తారు.

పటిష్ట బందోబస్తు

అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న సిరిమానోత్సవానికి పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు అందిస్తోంది. ఇద్దరు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 58 మంది సీఐ/ఆర్‌ఐలు, 144 మంది ఎస్‌ఐలు/ఆర్‌ఎస్‌ఐలు, 19 మంది మహిళా ఎస్‌ఐలు, ఇతర పోలీస్ అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో సహా 2015 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు.

డ్వాక్రాబజార్‌కు సందర్శకుల తాకిడి



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న స్టాల్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ట్యాంక్‌బండ్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి డ్వాక్రా బజార్‌కు సోమవారం సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రదర్శనలో ఉంచిన ఆభరణాలు, గృహోపకరణాలు, హస్తకళా వస్తువులు, తినుబండారాల స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. రెండురోజుల్లో రూ.45.96 లక్షల విక్రయాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే నెల 8వ తేదీ వరకు బజార్ నిర్వహిస్తామన్నారు.

రైలు ప్రమాదం దురదృష్టకరం : ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: కొత్తవలస మండలంలోని కంటకాపల్లి సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం దురదృష్టకరమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలుగోలులో సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన క్షణాల్లోనే ప్రభుత్వం సహాయక చర్యలు ప్రారంభించిందని.. సీఎం జగనన్న ఆదేశాలతో క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలందించారన్నారు.

సుందర నగరంగా విజయనగరం

విజయనగరం: విజయనగరం సుందరీకరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నగరంలోని మయూరికూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కాఫీ కప్ విత్ వాటర్ ఆకృతిని, అచంట గార్డెన్‌ను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి సోమవారం ప్రారంభించారు. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను, బుద్ధుని విగ్రహాన్ని, విజయనగరం విద్యుత్ నామఫలకాలను ఆవిష్కరించారు.

విద్యుత్ దీపాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



అచంటా గార్డెన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అలరించిన మ్యూజికల్ నైట్



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ, గాయకులు

విజయనగరం రూరల్: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పడుగను పురస్కరించుకుని స్థానిక అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్ వీక్షకులను అలరించింది. ఒకవైపు జానపద నృత్యాలు, నాట్యాలతో కళాకారులు ఆకట్టుకుంటే.. మరోవైపు వివిధ తెలుగు చలన చిత్రాల నేపథ్య గీతాలను సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ ఆధ్వర్యంలో గాయకులు రాహుల్ సిప్లీగంజ్, సునీత, సాయిచరణ్, తదితరులు ఆలపించారు. అలాగే జబర్దస్త్ ఫేమ్ రామ్‌ప్రసాద్, ఇమ్మాన్యుయేల్, తదితరులు ప్రదర్శించిన స్కిట్ నవ్వులు పూయించింది. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, శాసన మండలి సభ్యులు డాక్టర్ సురేష్‌బాబు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు.

ఉత్సాహంగా క్రీడా సంబరం

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు సోమవారం ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. సెట్విజ్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌క్రీడామైదానం ప్రాంగణంలో కరాటే, కుస్తీ, ఫెన్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెలూన్స్ ఫెస్టివల్, పతంగుల ఎగురవేత పోటీలు నిర్వహించారు. అలాగే ఆదివారం ప్రారంభమైన ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు రెండవ రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భోగాపురం: మండలంలోని తోటపల్లి మద్యం షాపు వద్ద ఈనెల 17న ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో విశాఖపట్నంలోని జాలారిపేటకు మరుపల్లి చినరాము(20)పై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

• రెండోరోజూ కొనసాగిన విజయనగర ఉత్సవ్



లయన్స్ క్లబ్ లో నృత్య ప్రదర్శన

విజయనగరం: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు అనుబంధంగా నిర్వహించిన విజయనగర ఉత్సవాలు రెండోరోజైన సోమవారం వేడుకగా సాగాయి. 13 వేదికల్లో నిర్వహించిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. విజయనగరం సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన ప్రజానీకంతో విజయనగరం కిటకిటలాడింది. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫల, పుష్ప ప్రదర్శన.. రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా సంబరాలు.. అయోధ్యా మైదానంలో నిర్వహించిన పెట్ షో.. ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన సంగీత ప్రదర్శనలు.. లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ప్రదర్శించిన కళాకారుల ప్రదర్శనలు.. గురజాడ కళాభారతిలో నిర్వహించిన నాటకాలు.. బొంకులదిబ్బపై ప్రదర్శించిన సురభి నాటక ప్రదర్శనలు.. కోట జంక్షన్ వద్ద నిర్వహించిన పులివేష ప్రదర్శనలు అబ్బురపరిచాయి. అయోధ్యా మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన మెగా మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. రింగురోడ్డు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆనందోబ్రహ్మ కార్యక్రమం అందరినీ ఆనందడోలికల్లో ముంచెత్తింది.



ఆనంద గజపతి కళాక్షేత్రంలో బీఏ నారాయణ సంగీత కచేరి



వంట నిర్వాహకులకు పాత్రలు అందజేస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

భోగాపురం: విద్యారంగ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. మండలంలోని రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన వంటపాత్రలు, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వాసుబాబు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఉప తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఎంఈఓలు రమణమూర్తి, బి. చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.